జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



మంగళవారం | 2-9-2025 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 442 పేజీలు: 4 వెల : రూ.7


# కనుగులవానిపేట సర్పంచ్‌కి.. అవమానం

* గెలిపించిన పాపానికి బిల్లులివ్వరా..? * ఆవేదనతో కలెక్టర్‌ను ఆశ్రయించిన టీడీపీ సర్పంచ్ * ప్రజా ప్రతినిధిని అవమానించిన అధికార యంత్రాంగం * ఏప్రిల్‌లో పనులు పూర్తయినా.. బిల్లులు పెట్టడంలో జాప్యం * ఎంబుక్‌లో నమోదు చేయకుండా నిర్లక్ష్యం * గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని గ్రామీణ నీటి సరఫరా విభాగం * గ్రామంలో కాలువ ధ్వంసం.. విచారణకే దూరం * బాధ్యత తప్పించుకునేలా పై అధికారుల తీరు * నన్ను పట్టించుకోవడం లేదని సర్పంచ్ ఆవేదన

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 1 (వార్త):** "ప్రజల కోసం కష్టపడితే అధికారుల దగ్గర అవమానం తప్పదా?" కనుగులవానిపేట గ్రామ సర్పంచ్ గంగు వెంకటరావు పరిస్థితి చూస్తే ఇలానే అనిపిస్తోంది. గ్రామ అభివృద్ధి కోసం తలమునకలై పనిచేసిన ఆయన, చివరకు జిల్లా కలెక్టర్ వరకు వెళ్లి వినతిపత్రాలు ఇవ్వాల్సిన స్థితి ఎదురైంది. ఏప్రిల్ 17 నాటికి గ్రామంలో రూ.4.90 లక్షలతో సీసీ డ్రైనేజీ, కవర్ బ్లాక్ పనులు పూర్తయ్యాయి. పంచాయతీ తీర్మానం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సూచనల ప్రకారమే పనులు జరిగాయి. కానీ ఇప్పటికీ ఆ పనులకు బిల్లులు మంజూరు కాలేదు, ఎంబుక్‌లో నమోదు జరగలేదు. ఈ నిర్లక్ష్యంపై సర్పంచ్ జూలై 27న అధికారికంగా ఫిర్యాదు చేసారు. జిల్లా కలెక్టర్ నిర్వహించే గ్రీవెన్స్కు స్వయంగా వెళ్లి ఫిర్యాదు చేశారు. ఒక అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అయి ఉండి కూడా తన గోడు కలెక్టర్ వద్దకు వెళ్లి అధికారులు తీరుపై ఫిర్యాదు చేయాల్సి రావడం నిజంగా దారుణం. నిబంధనల ప్రకారం గ్రీవెన్స్




ఫిర్యాదు అందుకున్న తర్వాత సదరు గ్రామీణ నీటి సరఫరా సంస్థ అధికారులు 30 రోజులలో స్పందించాల్సి ఉంటుంది. మొదట నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాలి, రెండోసారి ప్రత్యక్ష విచారణ జరగాలి, మూడోసారి పని పూర్తయిన ఫోటోను ఇంజినీరింగ్ అసిస్టెంట్ స్వయంగా తీసి అప్‌లోడ్ చేయాలి. కానీ కనుగులవానిపేట ఫిర్యాదులో ఇవేవీ జరగలేదు. సంబంధం లేని ఒకే ఫోటోను మూడు సార్లు వాడి 'పరిష్కరించాం' అని రిపోర్టు పెట్టేశారు. ఇది పూర్తిగా నియమావళికి విరుద్ధమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

### కాలువ ధ్వంసం.. విచారణే లేదు

ఇక జూలై 17న గ్రామంలో నిర్మించిన సీసీ కాలువను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామ ప్రజల కష్టార్జిత డబ్బుతో నిర్మించిన అభివృద్ధి పనులు ధ్వంసం కావడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తమైంది. కానీ ఈ ఘటనపై విచారణ జరగలేదు. పత్రికలలో వార్తలు వచ్చినా అధికారులు మౌనంగా ఉండిపోవడం ఆగ్రహం రేపుతోంది. ధ్వంసం చేసింది ఎవరో స్పష్టంగా అధికారులకు తెలుసు. అది కొందరు వైఎస్‌ఆర్‌సిపి కార్యకర్తల పనేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై వాస్తవానికి పోలీసులకు అధికారులు ఫిర్యాదు చేయాలి. కానీ దాచిపెట్టడం కనుక ఆంతర్యం ఏమిటో తెలియడం లేదు.

### పై అధికారులు తప్పించుకునే ఆట..

కనుగులవానిపేట పనుల విషయంలో కేవలం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పైనే నెట్టేసి పైస్థాయి అధికారులు బాధ్యత తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసిస్టెంట్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్ స్థాయి అధికారులు పర్యవేక్షించాల్సిన చోట "ఇది మా పనే కాదు" అన్నట్లుగా పక్కకు తప్పుకోవడం గ్రామ ప్రజల్లో ఆగ్రహం రేపుతోంది. ప్రజా ప్రతినిధిని అవమానించే స్థితి వస్తే సరిపోతుందా? అన్న ప్రశ్నలు అక్కడ కాక రేపుతున్నాయి. చిన్న ఉద్యోగి చేసిన తప్పిదాలను బేరీజు వేసి సరిదిద్దే




బదులు, పై అధికారులు 'తమ కుర్చీ కాపాడుకోవడమే' ముఖ్యమని



భావిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం శ్రమిస్తున్నాం. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు వృథా అవుతున్నాయని, సమస్య పరిష్కారం కోసం కలెక్టర్ వరకు వెళ్లాల్సి రావడం బాధాకరం అని సర్పంచ్ గంగు వెంకటరావు అధికారుల దగ్గర వాపోతున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన సర్పంచ్‌ను ఇలా అవమానించడం వెనుక రాజకీయ కోణం ఉందా? లేకపోతే అధికారులు అలవాటైన నిర్లక్ష్యంతోనే వ్యవహరించారా? అన్నది గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

### కలెక్టర్ చర్యలు తీసుకుంటారా?

ఇప్పటికే కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించిన సర్పంచ్.. సమస్యల పరిష్కారంపై గత నెల 28న హామీ పొందారు. చూస్తుండగానే నెల రోజులు గడిచిపోయాయి. ఫిర్యాదు సమస్య పరిష్కారమైనట్లు సర్పంచుకు సమాచారం చేరవేశారు. అది తప్పుడు సమాచారం అని ఇంకా కలెక్టర్ వరకు తెలియదు. కానీ వాస్తవానికి చర్యలు ఎప్పుడొస్తాయి? అధికారుల నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకుంటారా? లేక ఈ కేసు కూడా ఫైళ్లలోనే ఎప్పటిలాగానే మగ్గిపోతుందా అన్నది చూడాలి.

# ఉచిత బస్సు ప్రయాణంపై.. విష ప్రచారం

* వైసీపీ నేతలు.. చీర కట్టుకొని బస్సెక్కితే.. ఉచితమో.. కాదో తెలుస్తుంది
* భావనపాడు ఫిషింగ్ హార్బర్ కల సాకారానికి కృషి
* అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించలేదు
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**సంతబొమ్మాళి, సెప్టెంబర్1 (వార్త):** మహిళలకు కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పిస్తోందని, వైసీపీ నేతలు మాత్రం ఉచిత బస్సులు ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారని, వాళ్లు చీరలు కట్టుకొని బస్సు ఎక్కితే ఉచితం ఉందో లేదో తెలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. సోమవారం సంతబొమ్మాళి మండలం భావనపాడులో మత్స్యకార, దివ్యాంగులు, సామాజిక పింఛన్లు, క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 11 వేల బస్సులుంటే 9 వేల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించామన్నారు. వాటి సంఖ్యను పెంచాలని సీఎం చంద్రబాబు మళ్లీ ఆలోచన చేస్తున్నారని తెలిపారు. మత్స్యకారుల జీవనోపాధికి భావనపాడు ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి చిత్తశుద్ధి, అంకితభావంతో కృషిచేస్తానన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్క దివ్యాంగులకు పింఛన్‌ను రద్దు చేయలేద న్నారు. జిల్లాలో నకిలీ అంగవైకల్య పత్రా లతో పింఛన్లు పొందుతున్నట్లు గుర్తించి 90 మంది వరకు నోటీసులు జారీ చేశా మని వెల్లడించారు. అర్హత ఉన్నట్లు అప్పీల్ చేసుకుని నిరూపిస్తే తక్షణమే దివ్యాంగుల పింఛన్లను మంజూరు చేస్తామన్నారు. భావనపాడులో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సబ్ స్టేషన్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. సముద్ర తీర ప్రాంతాలైన వాడపేట, మధ్య పేట, కొత్తపేటను కలుపుతూ పర్యాటకంగా అభివృద్ధికి రహదాల నిర్మాణాలను చేపట్ట నున్నామని మంత్రి తెలిపారు. భావనపాడు గ్రామంలో రూ.2.31 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. రూ.1.21 కోట్లతో బీచ్ వరకు పర్యాటక రోడ్లను మంత్రి ప్రారంభించారు. రూ.1.10 కోట్ల గ్రామ అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.40 లక్షలలో నిర్మించిన పది చేపలు ఎండబెట్టుకునే ప్లాట్ ఫారాలను ప్రారంభించారు. అంతకు ముందు ఇసుక మేటలు వలన చేపల వేట జరగక జీవనోపాధి



కోల్పోతున్నామని మత్స్యకారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, బోట్లో ప్రయాణించి స్వయంగా ఆ ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరు కట్ల విశ్వప్రసాద్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, జిల్లా ట్రైనీ సహాయ కలెక్టర్ దొనక పృథ్వీ రాజ్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్డిఏ పిడి ఎన్.కిరణ్ కుమార్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్



**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబర్ 1 (వార్త):** సెల్ టవర్ ఎక్కి ఓ యువకుడు హల్‌చల్ చేసిన ఘటన శ్రీకాకుళం నగరంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పొందూరు మండలం కింతలి–కనిమెట్ట గ్రామానికి చెందిన వి.శివకుమార్ ఎచ్చెర్ల మండలానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఇటీవల ఆ యువతి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేడంతో వారు ఎచ్చెర్ల పోలీసులు, గ్రామ పెద్దలను ఆశ్రయించారు. దీంతో వారు శివకుమార్‌ను మందలించారు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు సోమవారం శ్రీకాకుళం నగరంలోని బీఎస్ఎన్ఎల్ డివిజన్ కార్యాలయం ఆవరణలోని సెల్ టవర్ ఎక్కాడు. 112 నంబరుకు కాల్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ఒకటో పట్టణ ఎస్సై హరికృష్ణ, పోలీసులు, అగ్నిమాపకశాఖ సిబ్బంది అక్కడికి చేసుకుని టవర్‌పై ఉన్న శివకుమార్‌కు నచ్చజెప్పి కిందికి దింపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం తాగించి.. కడతేర్చాడు

**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబర్ 1 (వార్త):** జి.సిగడాం మండలం గెడ్డకంచరాం గ్రామానికి చెందిన పుక్కళ్ల రాజశేఖర్‌ను స్నేహితుడే పొడిచి చంపేశాడని జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. గొబ్బూరు గ్రామానికి చెందిన నిందితుడు దమరసింగు గొల్లబాబు అలియాస్ శంకర్‌ను సోమవారం అరెస్టు చేసి జైలుకు తరలించామన్నారు. పుక్కళ్ల రాజశేఖర్, దమరసింగు గొల్లబాబులు పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తుండేవారు. వీరిద్దరి మధ్య ఎప్పటి నుంచి విభేదాలు ఉన్నాయి. ఈవిభేదాల కారణంగా రాజశేఖర్‌ను హతమార్చాలన్న ఉద్దేశంతో గొల్ల బాబు.. రాజశేఖర్‌తో కలిసి మద్యం తాగి గొడవపడ్డారు. ఇదే అదనుగా భావించిన గొల్లబాబు గెడ్డకంచరాం గ్రామ కూడలి మీదుగా నడిచి వెళ్తున్న రాజశేఖర్‌ను కత్తితో పొడిచాడు. శ్రీకాకుళం రిమ్స్‌కు కుటుంబ సభ్యులు తరలించగా చికిత్స పొందుతూ ఆగస్టు 25న మృతి చెందాడని సీఐ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# చంద్రబాబు విజన్ ..పథకాలు ఆదర్శనీయం

**- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, సెప్టెంబరు 1(వార్త):** మూడు దశాబ్దాలలో నాలుగు సార్లు సీఎంగా చంద్రబాబు తెచ్చిన 30 పథకాలు, కార్యక్రమాలు, సంస్కరణలు దేశంలోనే సంచలనంగా మారాయని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ప్రజల వద్దకు పాలన, జన్మభూమి, క్లీన్ అండ్ గ్రీన్, దీపం పథకం, ఆదరణ పథకాలు అమలు చేశారన్నారు. తొలిసారి డ్వాక్రా సంఘాల ఏర్పాటు ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విజన్ 2020తో పాలనకు కొత్తగా రూపకల్పన చేశారని తెలిపారు. విద్యా రంగంలో మార్పుల తీసుకొచ్చి చంద్రబాబు తన మార్కు చూపించారన్నారు.



# రైతులకు తక్షణమే ఎరువులు అందించాలి

**పలాస, సెప్టెంబరు 1(వార్త):**రైతులకు యూరియా, డీఏపీ, పొటాష్ వెంటనే సరఫరా చేయాలని జేడి రైతు సంఘం జిల్లా కార్యదర్శి తెప్పల అజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాకన్నపల్లి సచివాలయం వద్ద రైతు సంఘం ఆధ్వ ర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తున్నా మాకన్నపల్లి రైతు సేవా కేంద్రానికి కేటాయించిన ఎరువులు ఇంతవరకు రాలేదన్నారు. సర్పంచ్ సైన దేసయ్య, ఉప సర్పంచ్ రాపాక పురుషోత్తం మాట్లాడుతూ ఎరువులు దొరక్క బ్లాక్ మార్కెట్లో రెట్టింపు ధరలకు కొనాల్సిన దుర్గతి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల ఇండెంట్ రానట్లయితే సచివాలయానికి తాళం వేయడానికి వెనుకాడమని హెచ్చరించారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శి శ్రీదేవికి వినతిపత్రం



అందజేశారు. కార్యక్రమంలో పుచ్చా బాబూరావు, ఆర్.ముసలయ్య టి.రాజు, బి.ప్రసాద్, జి.నీల కంఠం, టి.సింహాద్రి, జె.లోకనాథం, ఎస్.ధర్మారావు, బి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# 1న పింఛన్ అందించడమే కూటమి లక్ష్యం

**నరసన్నపేట, సెప్టెంబరు 1(వార్త):** ప్రతి నెలా 1న పింఛన్ అందించడమే కూటమి లక్ష్యమని ఏపీ కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు అన్నారు. సోమవారం ఆయన నరసన్నపేటలోని గాంధీనగర్, కోవెల వీధుల్లో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ కృష్ణబాబు, అధికారులు పాల్గొన్నారు.

# వినాయకుడికి బాబా ప్రత్యేక పూజలు



**పలాస, సెప్టెంబరు 1(వార్త):** సర్వ విఘ్న సంహారం.. మహా గణపతి అవతారం' అని పలాస శివాజీనగర్ షిరిడి సంస్థాన్ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ (బాబా) అన్నారు. సోమవారం ఆయన వాసుదేవపేట, శివాజీ నగర్, రాజగోపాలపురంల్లో కొలువైన బొజ్జ గణపయ్యను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వమే గణేష్ తత్వమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూన హేమాచలం, దువ్వాడ నవీన్‌చౌదరి, శివరామకృష్ణ, కోటిరెడ్డి, సప్ప సింహా చలం, దాసరి విజయ్, కాల తిరుమల, కిల్లి ఆనంద్, మార్పు శ్యామ్, పిట్ట రవి కుమార్, ప్రదీప్ పండా, కాళీ మాస్టారు, జినగ రాంనరేష్, తిరుణగరి శ్రీనివాస్, సుబ్బి రెడ్డి, మూల దయాకర్, కింతలి బాబురావు, సాయివర్దన్, గొర్లె వేణు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అన్యాయం చేయం : ఎమ్మెల్యే బగ్గు



**పోలాకి, సెప్టెంబరు 1(వార్త):** కూటమి ప్రభుత్వంలో దివ్యాంగులకు ఎటువంటి అన్యాయం జరగదని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన మబగాంంలో పింఛన్లు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో కొందరు నకిలీ వికలాంగ పత్రాలు పొందడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై నిజ నిర్ధారణకు వైద్య పరీక్షలు చేపట్టామన్నారు. కార్యక్ర మంలో ఎంపీడీవో, కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానంపై విస్తృత ప్రచారం చేయాలి

**మందస, సెప్టెంబరు 1(వార్త):** నేత్రదానంపై విద్యార్థులు విస్తృత ప్రచారం చేయాలని వక్తలు కోరారు. మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్తాల్మిక్ ఆఫీసర్ రోణంకి వెంకటరమణ మాట్లాడుతూ మన దేశంలో సుమారు 12లక్షల మంది కార్నియల్ అంధత్వంతో బాధపడుతున్నారని, ప్రతీ సంవత్సరం 20 నుంచి 25వేల మంది ఈ అంధత్వానికి గురవుతున్నారన్నారు. దీని నివారణకు దాతల కార్నియా అవసరమన్నారు. నేత్రదానం చేసి చిరంజీవులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కాలేజీ విద్యార్థులు నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.తేజేశ్వరరావు, అధ్యాపకులు బాడ వెంకట్‌మోహన్, జి.రమణ మూర్తి, దుర్యోధన, గోవిందరాజులు, నాగభూషణ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# మహానేత వైఎస్సార్ వర్ధంతికి తరలి రండి


**-వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు**



**పలాస, సెప్టెంబరు 1(వార్త):** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ వర్ధంతిని మంగళ వారం ఘనంగా నిర్వహించాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు సోమవారం ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డాక్టర్ వైయస్సార్ వర్ధంతి సందర్భంగా పలాసలో ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హాజరవుతారని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

# పోలాకి ఏఎస్ఐ ఆదినారాయణ ఆకస్మిక మృతి

**పోలాకి, సెప్టెంబరు 1(వార్త):** పోలాకి ఏఎస్ఐ ఆదినారాయణ(49) ఆకస్మి కంగా మృతి చెందారు. కొంతకాలంగా స్వల్ప అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఆయన స్వస్థలం నరసన్నపేటలోని భవానీపురం. మూడేళ్లుగా పోలాకి పోలీస్‌స్టేషన్‌లో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మృతిపై పోలీస్ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



# ఘనంగా ఎంపీపీ డొక్కరి దానయ్య జన్మదిన వేడుకలు

**మందస, సెప్టెంబరు 1(వార్త):** క్రమశిక్షణకు, కార్యదీక్షకు పర్యాయపదమే ఎంపీపీ డొక్కరి దానయ్య అని వక్తలు అన్నారు. ఎంపీపీ దానయ్య జన్మదిన వేడుకలు బహడపల్లి, మందస, వైసీపీ కార్యాలయం ప్రగతిభవన్‌లో జరిగాయి. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మందస మండల వైసీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో దానయ్య కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీకి దానయ్య చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి, ఉపాధ్యక్షుడు పీతాంబరం, జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియా రామకృష్ణ, యువజన కార్యదర్శి సార రవి కుమార్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు దున్న హరికృష్ణ, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు మట్ట జయరాం, సాంస్కృతిక అధ్యక్షుడు మామిడి కృష్ణారావు, నియోజక వర్గ బూత్ కమిటీ కన్వీనర్ చింతాడ గణపతి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సొర్ర ఢిల్లీరావు, మండల ప్రధాన కార్యదర్శి సురేష్ పాణిగ్రాహి, మండల కార్యదర్శి గుంపు జగదీశ్, సర్పంచులు గున్న రమణ, మామిడి సింహాద్రి, బత్తిన తేజేశ్వరరావు, బొడ్డు ఉమాపతి, బహడపల్లి పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మామిడి తులసయ్య, సోషల్ మీడియా సభ్యులు కొల్లి రామారావు, బహడపల్లి పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.



# వినాయకునికి కేడీఆర్ విరాళం

**పలాస, సెప్టెంబరు 1(వార్త):** బొడ్డపాడులో ఏర్పాటు చేసిన ఎనిమిది వినాయక మండపాలకు కలిపి తెలుగుదేశం పార్టీ నాయకులు కిక్కిర ఢిల్లేశ్వరరావు సోమ వారం రూ.8000 విరాళంగా ఆయా కమిటీ సభ్యులకు అందజేశారు. వినాయకుని దయతో గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలు

**పలాస, సెప్టెంబరు 1(వార్త):** పద్మనాభపురం సమీప పాత జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి స్కూటీ బోల్తా పడ డంతో అంబుసోలి గ్రామానికి చెందిన కొమ్మల సత్య, చీమల కల్పనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం పలాస ఆసుపత్రికి తరలించగా ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి విశాఖ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## నీట్ విజేతకు ఘన సన్మానం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 1(వార్త):** డొంకూరు పాఠశాల పూర్వ విద్యార్థి బూర్జపాడు చినలక్ష్మీపురానికి చెందిన యర్ర ప్రభాస్, నీట్‌లో సీటు సాధించాడు. దీంతో ఆయనను సోమవారం ప్రత్యేకంగా పాఠశాలలో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎమ్ జి.హేమకుమారి, చైర్మన్ కె.జానకిరామ్, గ్రామ పెద్దలు కూర్మారావు, లోకనాథం, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తులసిగాంలో లడ్డు వేలం



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 1(వార్త):** తులసిగాంలో వినాయక లడ్డు వేలం పాట సోమవారం నిర్వహించారు. ఉరిటి మల్లేష్ ఆ లడ్డును రూ.10516కు దక్కించుకున్నారు.

## నేడు ఎయిర్‌పోర్ట్ సాధన సమితి సమావేశం

**మందస, సెప్టెంబరు 1(వార్త):** ఎయిర్‌పోర్ట్ సాధన సమితి తొలి సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు బాలిగాం-హరిపురం జంక్షన్ పరిధిలో నరేష్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో ఎయిర్ పోర్ట్ సాధనకు ఎలా ముందుకెళ్లాలనే విషయాలు చర్చించి, శాసనసభ్యురాలు, కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. తగిన సలహాలు, సూచనలు ఇవ్వడానికి సాధన సమితి సభ్యులు, పాత్రికేయ సోదరులు హాజరు కావాలని వారు కోరారు.

## పింఛన్లు పంపిణీ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 1(వార్త):** మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, ప్రధాన కార్యదర్శి దక్కత కామేష్‌రెడ్డి సోమవారం ఇచ్ఛాపురంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గుజ్జు భీమరాజు, నరేంద్ర, పురుషోత్తం, శ్యామ్ సుందర్, హేమసుందర్ పాల్గొన్నారు. 15 వార్డులో తెలుగుదేశం నాయకులు నందిగం కోటి, సరస్వతి, సచివాలయం అడ్మిన్ జీనాత్ పాల్గొన్నారు. 11 వార్డులో కౌన్సిలర్ ఆసి లీలారాణి పింఛన్లు పంపిణీ చేశారు. కేసుపురంలో స్మార్ట్ రేషన్ కార్డ్ లు పంపిణీ చేశారు.

## అలరించిన నాట్య ప్రదర్శన

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 1(వార్త):** సన్యాసిపుట్టుగలో సిద్ధి వినాయక పూజ మహోత్సవ సందర్భంగా వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ విద్యార్థులు చేసిన కూచిపూడి, భరతనాట్యం, జానపదాలు, ఒరియా సంబల్పూరి నృత్యాలు ఆహుతులను అలరించాయి. నాట్య గురువు శృతి పట్నాయక్, అకాడమీ స్థాపకుడు చిన్నా గురుస్వామి, స్వాగత కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.



# జిల్లాకు కణితి సేవలు మరువలేనివి

**-విశ్వనాథం విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, సెప్టెంబరు 1(వార్త):** జిల్లాకు కణితి విశ్వనాథం చేసిన సేవలు మరువ లేనివని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవ రణలో ఏర్పాటు చేసిన కీర్తిశేషులు మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం విగ్రహాన్ని సోమవారం ఆమె ఆవిష్కరించారు. పలాస ప్రాంతానికి విశ్వనాథం చేసిన సేవలను ఆమె గుర్తు చేశారు. వైద్యునిగా, రాజకీయ వేత్తగా చెరగని ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రవికుమార్, ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, పీడీ తవిటయ్య, టీడీపీ నాయకులు లొడగల కామేష్, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబుగాం మోటార్ యూనియన్ ఉదారత



**మందస, సెప్టెంబరు 1(వార్త):** పేద కుటుంబానికి సాయమందించి, అంబుగాం లోని మోటార్ యూనియన్ తన ఉదారతను చాటుకుంది. ఆ గ్రామానికి చెందిన రాజమండ్రి వల్లభరావు(50) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. రెక్కాడితే గాని డొక్కాడని వల్లభరావు కుటుంబ పరిస్థితి తెలుసుకున్న శ్రీశ్రీ బైకిలిపోలమ్మ తల్లి మోటార్ యూనియన్ సభ్యులు సోమవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన భార్య గున్నమ్మకు రూ.20,000లు అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రాజమండ్రి రాజారావు, సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. మోటార్ యూనియన్ సభ్యులను గ్రామస్తులు ప్రశంసించారు.

# ఎరువుల కొరతను తీర్చండి

**-బొడ్డపాడు సచివాలయంలో వినతిపత్రం అందజేసిన ఏఐకేఎం, రైతు సంఘం నాయకులు**

**పలాస, సెప్టెంబరు 1(వార్త):** బొడ్డపాడు గ్రామ రైతు సేవా కేంద్రానికి ఎరువులు ఎప్పుడు వస్తాయని ఏఐకేఎం, రైతు సంఘం నాయకులు ఆ గ్రామ సచివాలయ కార్యదర్శిని నిలదీశారు. ఈ మేరకు సోమవారం వారు సచివాలయ సెక్రటరీ రవికి వినతిపత్రం అందజేశారు. బొడ్డపాడు రైతు సేవా కేంద్రంలో ఎరువులు యూరియా, డీఏపీ, పొటాష్, గ్రోమోర్, సేంద్రియ ఎరువులు అందుబాటులో ఉంచాలని అఖిల భారత కిసాన్ మహాసభ (ఏఐకేఎం) జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసి రావు, రైతు నాయకులు పోతనపల్లి అప్పారావు, నెయ్యిల యుగంధర్, బోనెల హేమారావు తదితరులు పాల్గొన్నారు.



# క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు



**సంతబొమ్మాళి, సెప్టెంబరు 1(వార్త):** వినాయక నవరాత్రుల్లో భాగంగా దండు గోపాలపురం పెద్దవీధిలో కళింగ కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, తృతీయ స్థానంలో బోరుభద్ర వివేకానంద పాఠశాల విద్యార్థులు నిలిచారు. విజేతలకు గ్రామ పెద్దలు ఆరంగి వసంతరావు, బెండి అరుణ్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి సూరి బాబు, తూట భాస్కరరావు, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజలకు అందుబాటులో ఉండడమే లక్ష్యం

**పలాస, సెప్టెంబరు 1(వార్త):** ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. ప్రజా వినతులను సోమవారం ఆమె తన కార్యాలయంలో స్వీకరించారు. ఆయా విభాగాల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు. రాజకీయాలకతీతంగా తాను పని చేస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లొడగల కామేశ్, గురుటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



# 300 కుటుంబాలతో జనసేనలోకి ఆడారు సర్పంచ్

**-పార్టీ కండువాలు వేసి**

**ఆహ్వానించిన ఎమ్మెల్యే జయకృష్ణ**

**వీరఘట్టం, సెప్టెంబరు 1(వార్త):** ఆడారు గ్రామ సర్పంచ్ నీలం సుధారాణి సోమవారం వైకాపాని వీడి జనసేన పార్టీలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో చేరారు. ఈమెతోపాటు ఆడారు గ్రామం నుంచి 150, చేబియ్యమ్మవలస నుంచి 60, డెప్పివలస నుంచి 90 కలిపి 300 కుటుంబాలు ఆ పార్టీలో చేరాయి. వీరఘట్టంలోని తన క్యాంప్ ఆఫీసులో వీరందరికీ ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వైకాపా సీనియర్ నాయకులు నీలం సత్యంనాయుడు, నీలం గణపతినాయుడు, కుప్పిలి చంద్రరావు, దువ్వ అప్పన్న, పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ పిట్ట చంద్రరావు, బర్ల దుర్గారావు, నాగళ్ల మారయ్య, నాగళ్ల పెంటయ్య, నాగళ్ల సన్యాసి తదితరులు ఉన్నారు. వీరు



పార్టీలో చేరేలా కృషి చేసిన మండల యువత అధ్యక్షుడు మాచర్ల అనిల్‌బాబును ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు ఉదయాన ఉదయభాస్కర్, తూముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## పుచ్చపాడులో భక్తి, శ్రద్ధలతో విఘ్నేశ్వర పూజలు

**మందస, సెప్టెంబరు 1(వార్త):** పితాతొళి పంచాయతీ పుచ్చపాడులో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. ప్రతీ రోజూ గణనాథునికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ నాయకులు అంపోలు కిరణ్‌కుమార్(వంశీ), శిస్టు బాలకృష్ణ, బాడ నరేష్, యవ్వారి వెంకట్ తెలిపారు. తొమ్మిది రోజుల అనంతరం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు.






## వినాయక నిమజ్జనంలో.. ఆకట్టుకున్న వేషధారణలు

**వీరఘట్టం, సెప్టెంబరు 1(వార్త):** వీరఘట్టంలోని కూరాకుల వీధిలో సోమవారం వినాయకుని నిమజ్జనం సందర్భంగా ఏర్పాటుచేసిన వివిధ వేషధారణలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సూర్య భగవానుడు, కాల భైరవుడు, గరుడ వాహనం మీద విష్ణుమూర్తి, మహిసాసుర మర్దని, అఘోరాలు వంటి వివిధ రూపాలు పలువురిని అబ్బురపరిచాయి. వీటిని చూసేందుకు జనాలు తండోపతండాలుగా రావడంతో మెయిన్ రోడ్ కిక్కిరిసిపోయింది. వినాయకుని దర్శించుకునేందుకు వేలాది మంది తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వీరఘట్టం టీడీపీ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ నిమజ్జనం వేడుకలు ఘనంగా జరి పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా ఎస్ఐ జి.కళాధర్, పోలీస్ సిబ్బంది గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.










## పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించండి

**జలుమూరు, సెప్టెంబరు 1(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించే దిశగా కృషి చేయాలని ఎంఈవో బమ్మిడి మాధవరావు సూచించారు. సోమవారం ఆయన మహ్మద్‌పురం, పాగోడు తదితర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. భోజన వసతి కల్పించేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## గల్ఫ్ ఫౌండేషన్ వితరణ




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 1(వార్త):** కేదారిపురానికి చెందిన డకువ భాస్కర్ భార్య పార్వతి(63)అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే వీరిని ఎవరూ అదరించడం లేదు. చాలా బీద కుటుంబమని తెలుసుకున్న కేదారిపురం గల్ఫ్ ఫౌండేషన్ వారు భాస్కర్‌కి రూ.20,000 ఆర్థిక సాయం సోమవారం అందజేశారు.

## 'దక్కత 'కుటుంబానికి పరామర్శ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 1(వార్త):** దివంగత మాజీ ఎమ్మెల్యే దక్కత అచ్యుత రామయ్య రెడ్డి భార్య ఆదిలక్ష్మి మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో ఆ కుటుంబాన్ని వైసీపీ మండల నాయకులు పరామర్శించారు. వీరిలో ఎంపీపీ బోర పుష్ప, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ కరింగి మోహనరావు, పతిర్ల రాజశేఖర్ రెడ్డి, ఆసి కేదారి, దక్కత నూకయ్య, చంద్రయ్య, దువ్వ వివేకానంద రెడ్డి తదితరులు ఉన్నారు. ఆమె కుటుంబానికి తమ సంతాపం తెలిపారు.

## నారాయణ సేవలో విద్యార్థులు

**పలాస, సెప్టెంబరు 1(వార్త):** రామకృష్ణాపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు తమ పాకెట్ మనీలో కొంత మొత్తంతో నారాయణసేవ చేస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం వారు పలాస రైల్వేస్టేషన్ ఆవరణలోని నారాయణలకు ఆహార ప్రసాదం, స్వామివారి విభూతి, చిత్రపటాన్ని అందజేశారు. నారాయణ సేవా ఇన్‌చార్జి దాలేటి, విద్యార్థులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546